



## శాంతిభద్రతల్ని పరిరక్షించండి

### కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు రప్పించండి

### గవర్నర్‌కు విజయ్ వినతి

చెన్నై, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, తక్షణమే వాటిని పరిరక్షించాలని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధినేత, ప్రముఖ సినీ నటుడు విజయ్ గవర్నర్ ఆర్ఎన్ రవికి విజ్ఞప్తి చేశారు. సోమవారం రాజ్‌భవన్‌కు వెళ్లిన విజయ్.. గవర్నర్‌తో అరగంటపాటు భేటీ అయ్యారు. రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న అత్యాచార ఘటనలు, దాడులు, దౌర్జన్యాల గురించి ఈ సందర్భంగా విజయ్ గవర్నర్‌కు వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా అన్నాయూనివర్శిటీ ప్రాంగణంలో యువతిపై అత్యాచారానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని కూడా సూచించారు. ఈ భేటీలో టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ తదితరులు కూడా పాల్గొన్నారు. కాగా రాజకీయ పార్టీ స్థాపించాక విజయ్.. గవర్నర్‌తో భేటీ కావడం ఇదే ప్రథమం.

**అన్నలా అండగా వుంటా: విజయ్**

రాష్ట్రంలోని ఆడపడచులందరికీ అన్నలా అండగా వుంటానని టీవీకే అధినేత విజయ్ హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆయన సోమవారం ఆయన బహిరంగ లేఖ విడుదల చేశారు. 'మీ భద్రత గురించి ఎవరిని అడగాలి? మనల్ని పాలించే నేతల్ని ఎన్నిమార్లు అడిగినా ప్రయోజనం శూన్యం. అందుకే ఇలా ప్రజలకే బహిరంగ లేఖ రాస్తున్నా. మీ అందరికీ అన్నలా అండగా వుంటాను. చదువుపైనే దృష్టి సారించండి. శాంతిభద్రతలు పరిఢవిల్లే తమిళనాడును నిర్మించుకుందాం. త్వరలోనే ఇది వాస్తవ రూపు దాల్చుతుంది'అని విజయ్ రాసిన లేఖలో పిలుపునిచ్చారు.



గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విజయ్





బ్రాడ్వేలో వెన్న, డ్రైఫ్రూట్ అలంకార సేవ - కాకలూర్ రామాలయంలో హనుమంతుడికి స్వర్ణకిరీటం



అశోక్ నగర్‌లో వెండికవచ అలంకారం

## భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

ప్యారీస్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఆలయాల్లో సోమవారం హనుమజ్జయంతి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఏటా తమిళ మార్గశిర అమావాస్య సందర్భంగా రాష్ట్రంలో హనుమజ్జయంతి నిర్వహిస్తుంటారు. ఆ మేరకు రాజధాని నగరం చెన్నైలో నంగనల్లూర్, అశోక్ నగర్, రాజా అన్నామలైపురం, మైలాపూర్, బ్రాడ్వే, తిరువళ్లూర్ జిల్లా కాకలూర్ మారుతి న్యూటౌన్ రామాలయం సహ ఆంజనేయ స్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

**అశోక్‌నగర్‌లో...**

అశోక్‌నగర్ ఆంజనేయ భక్తసభ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించి, వెండి కవచంతో అలంకరించారు. ఆదివారం సాయంత్రం ఏక దిన లక్షార్చన, పుష్పయాగం, వడమాలాలకరణ, విశేషపూజలు జరిగాయి. ఈ ఆలయంలో హనుమజ్జయంతి పదిరోజుల ఉత్సవంగా నిర్వహిస్తున్నారు. అలాగే అశోక్‌నగర్ సామియార్ తోటంవీధిలోని కరుమారి మహాత్రిపుర సుందరి ఆలయప్రాంగణంలోని హనుమద్ ఆలయంలో స్వామివారికి లక్షా ఎనిమిది వడలతో అలంకరించారు.

**కాకలూర్‌లో...**

తిరువళ్లూర్ సమీపంలోని కాకలూర్ మారుతీ న్యూటౌన్ సెల్వగణపతి రామాలయంలో హనుమజ్జయంతి సందర్భంగా హనుమంతుడికి 16రకాల అభిషేకాలు, వెన్నతో అలంకారం చేశారు. స్వామివారికి సింధూరం, పట్టువస్త్రాలు, పండ్లు సమర్పించి దూపదీపాలతో హారతులిచ్చారు.

**మైలాపూర్‌లో...**

మైలాపూర్‌లోని వారాహి ఆలయంలో ఆంజనేయహోమం, వడమాల దర్శనం, విశ్వరూప ఆంజనేయ అలంకార సేవల్లో భక్తులు పాల్గొన్నారు. అలాగే సేలయూర్ మహాలక్ష్మీ నగర్‌లో పంచముఖ ఆంజనేయస్వామికి, గౌరివాక్కం కాలేజీ రోడ్డులో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి కోలాహలంగా నిర్వహించారు.

**బ్రాడ్వేలో...**

బ్రాడ్వే ఆచారప్పన్ వీధిలోని అక్షయబాబా ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా రామబంటుకు వెన్న, డ్రైఫ్రూట్, వడమాలతో అలంకారం, దీపారాధన చేశారు. జైవాసవి సాయి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ అజంతా డా.కనిగెలుపుల శంకర్ రావు పర్యవేక్షణలో విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు సామూహిక హనుమాన్ ఛాలీసా పారాయణం చేశారు.



మహాత్రిపుర సుందరి ఆలయంలో ఆంజనేయస్వామికి లక్షా ఎనిమిది వడ మాలతో అలంకారం



ఆర్థిక సాయం అందజేస్తున్న సీఎం స్టాలిన్

## మహిళల ఉన్నత విద్యలో అగ్రస్థానం

● సీఎం స్టాలిన్ వెల్లడి

అడయార్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహిళల ఉన్నత విద్యలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే విద్యార్థినులకు 'పుదుమైపెణ్' పథకం విస్తరణ కార్యక్రమం సోమవారం తూత్తుకుడిలోని కామరాజర్ కాలేజీ ప్రాంగణంలో జరిగింది. ప్రస్తుతం ఈ పథకం కింద 75,028 మంది విద్యార్థినులకు నెలకు రూ.1000 చొప్పున ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందజేస్తోంది. ఇపుడు ఈ పథకాన్ని ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థినులకు కూడా విస్తరించారు. ఈ పథకం ప్రారంభోత్సవంలో సీఎం స్టాలిన్ ప్రసంగిస్తూ... రాష్ట్రానికి చెందిన మహిళలు దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నారన్నారు. ఉన్నత విద్య అభ్యసించడంలోనూ దేశంలోనే వారే మొదటి స్థానంలో ఉన్నారని గుర్తుచేశారు. విద్యారంగంలో అనేక సంస్కరణలను జస్టిస్ పార్టీ పాలనలో తీసుకొచ్చిందన్నారు. ఆ తర్వాత కామరాజర్ ప్రభుత్వ హయాంలో అధిక సంఖ్యలో పాఠశాలలు ప్రారంభించారన్నారు. 1967లో అధికారంలోకి వచ్చిన అన్నాదురై విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, ఆయన మృతి తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన దివంగత కలైంజర్ కరుణానిధి విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి, శ్రద్ధ చూపారన్నారు. విద్య, వైద్యం, న్యాయ, తమిళ భాష, పశువైద్యం ఇలా ప్రతి ఒక్కదానికి వేర్వేరుగా విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. . ఈ బాటలోనే తమ ప్రభుత్వం కూడా విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కలైంజర్ మహిళ సామాజిక ఆర్థిక సాయం పథకం కింద ప్రతి నెలా అనేక మంది మహిళలు ఆర్థిక సాయం పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు గీతా జీవన్, అనితా రాధాకృష్ణన్, అన్బిల్ మహేశ్, ఎంపి కనిమొళి, తూత్తుక్కుడి మేయర్ జగన్ పెరియస్వామి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

### న్యాయమూర్తులు

## ప్రజలకు న్యాయం అందించాలి

### మద్రాస్ హైకోర్టు సీజే కేఆర్ శ్రీరామ్

### 11 అంతస్తుల అడ్మినిస్ట్రేషన్ భవనం ప్రారంభం



భవనం ప్రారంభోత్సవంలో న్యాయమూర్తులు

అడయార్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కారుమబ్బులు ఊహించని విధంగా ఎలా వర్షాన్ని కురిపిస్తాయో ఆ రీతిలోనే న్యాయమూర్తులు ప్రజలకు న్యాయం అందించాలని మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్ పిలుపునిచ్చారు. మద్రాసు హైకోర్టు ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన 11 అంతస్తుల అడ్మినిస్ట్రేషన్ భవనాన్ని ఆయన సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఎంఎం సుందరేశ్, మహదేవన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల మౌనం పాటించి నివాళులు అర్పించారు. అనంతరం చీఫ్ జస్టిస్ శ్రీరామ్ మాట్లాడుతూ, న్యాయం అందించడంలో పరిపాలన యంత్రాంగ (అడ్మినిస్ట్రేషన్) సహకారం ఎంతో కీలకమన్నారు. అలాంటి యంత్రాంగానికి సరైన భవన, సదుపాయం, స్థలాభావ లేమితో ఇబ్బంది పడేవారమని, ఇపుడు ఈ సమస్యలన్నీ తీరిపోతాయన్నారు. ఈ భవన నిర్మాణానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ భవనంలో కేసులకు సంబంధించిన దస్త్రాలు, న్యాయ శాఖకు సంబంధించిన లెక్కలు (అకౌంట్స్), పోస్టల్ విభాగం, కేసు కార్యాలయాలు ఇలా ప్రతి విభాగం ఈ కొత్త భవనంలో పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఎంఎం సుందరేష్, ఆర్ మహాదేవన్, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తులు ఎస్ఎస్.సుందర్, ఆర్.సుబ్రమణియన్, ఆర్.సురేష్ కుమార్, న్యాయమూర్తులు, కేంద్ర ప్రభుత్వ సొలిసిటర్ జనరల్ ఏఆర్ఎల్ సుందరేశన్, ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ పీఎస్ రామన్, మద్రాస్ హైకోర్టు రిజిస్ట్రార్ ఎస్. అల్లీ, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జి.మోహన్‌కృష్ణన్, కార్యదర్శి ఆర్.కృష్ణకుమార్, కోశాధికారి జి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



నూతన భవనం

## పశువుల సంచారంపై నిషేధానికి చర్యలు: మేయర్



ప్యారీస్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో పశువులు, శునకాల సంచారాన్ని నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) మేయర్ ప్రియా రాజన్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం రిప్పన్ బిల్డింగ్ ప్రాంగణంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, కమిషనర్ కుమరగురుపరన్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పలు పార్టీల కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సమావేశం ప్రారంభం కాగానే ఇటీవల మృతిచెందిన మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్‌లకు సంతాపం తెలుపుతూ.. కౌన్సిల్ సభ్యులంతా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మేయర్ ప్రియా సమాధానం చెప్పారు. నగరంలోని 200 వార్డుల్లో పశువులు, శునకాలు రోడ్లపై తిరుగుతున్నందున పాదచారులకు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని ఈ సమస్యను నివారించేలా ఆకస్మిక చర్యలు చేపట్టనున్నట్లు మేయర్ హామీయిచ్చారు.

**తాంబరం కార్పొరేషన్‌లో...:** తాంబరం కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం మేయర్ వసంతకుమారి అధ్యక్షతన సోమవారం జరిగింది. ఇందులో జోనల్ ఛైర్మెన్‌లు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. డీపీఐకు చెందిన 20 మంది సభ్యులు సమావేశం ప్రారంభమైన వెంటనే అంబేడ్కర్ చిత్రపటంతో లేచి నిలబడి కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్‌షాకు వ్యతిరేకంగా తీర్మానం ఆమోదించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థినిపై అత్యాచారం కేసు

## ఒకేసారి మహిళా కమిషన్, సిట్ విచారణ ప్రారంభం

చెన్నై, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నావిశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ విద్యార్థినిపై జరిగిన అత్యాచారం వ్యవహారంపై ఒకేరోజు జాతీయ మహిళా కమిషన్, హైకోర్టు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ ప్రారంభించింది. సోమవారం ఉదయం ఓ వైపు మహిళా కమిషన్ అధికారులు, మరో వైపు సిట్ అధికారులు విద్యార్థులను, అధికారులు, అధ్యాపకులు, సిబ్బందిని వరుసగా విచారణ జరిపారు. ఈ కేసుకు సంబంధించి సిట్ అధికారులు ఆదివారమే విచారణ చేపట్టారు. కోట్టూరుపురం మహిళా పోలీసుస్టేషన్‌కు వెళ్లి కేసు సంబంధించిన ఫైళ్ళను స్వీకరించారు. సోమవారం ఉదయం సిట్ అధికారులు ముగ్గురికి సహాయకులు కొంతమంది కానిస్టేబుళ్లను కూడా నియమించారు. వీరంతా అన్నా విశ్వవిద్యాలయానికి వెళ్ళి విచారణ ప్రారంభించారు. ఈ కేసును విచారించడానికి జాతీయ మహిళా కమిషన్ సభ్యులు మమతాకుమారి, ప్రవీణ్‌దీక్షిత్ ఢిల్లీ నుండి ఆదివారం రాత్రి నగరానికి చేరుకున్నారు. సోమవారం ఉదయం వీరు అన్నా విశ్వవిద్యాలయం ప్రాంగణం అంతా కలియతిరిగి విద్యార్థినులకు భద్రతాలోపాలు ఏవైనా ఉన్నాయా అని పరిశీలించారు. అదే విధంగా అత్యాచారం జరిగిన ప్రాంతాన్ని కూడా తనిఖీ చేశారు. సీసీ ఫుటేజీ కూడా వీరు పరిశీలించారు. అత్యాచారం జరిగిన రోజు నిందితుడు జ్ఞానశేఖరన్ ఎన్నిసార్లు ఆ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో చొరబడ్డారనే విషయాలను కూడా అడిగి తెలుసుకున్నారు.



ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు స్నేహప్రియ, ఐమన్ జమాల్, బృందా

**ఎఫ్ఐఆర్ లీక్‌పై 14 మందికి సమన్లు**

ఈ అత్యాచారానికి సంబంధించి ప్రాథమిక దర్యాప్తు నివేదిక (ఎఫ్ఐఆర్)ను లీక్ చేయడంలో కీలకపాత్రను పోషించిన 14 మందిని కూడా సిట్ అధికారులు విచారణ జరుపనున్నారు. త్వరలో వీరందరికి సమన్లు కూడా జారీ చేయాలని నిర్ణయించారు.

## అత్యాచార దోషులను శిక్షించాలంటూ అన్నాడీఎంకే ఆందోళన

ప్యారీస్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని అన్నా వర్సిటీ ప్రాంగణంలో ఇంజినీరింగ్ విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనను ఖండిస్తూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలో పాల్గొన్న అన్నాడీఎంకే శ్రేణులను పోలీసులు అరెస్ట్ చేశారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పిలుపు మేరకు చెంగల్‌పట్టు జిల్లా పార్టీ కార్యదర్శి రాజేంద్రన్ నేతృత్వంలో చెంగల్‌పట్టు బస్టాండు సమీపంలో నిర్వహించిన రాస్తారోకోలో మాజీమంత్రి కేపీ మునుస్వామి, ఎమ్మెల్యే మరగదన్ కొమరవేలు, అమ్మాపేరవై, విద్యార్థి, న్యాయవాదులు, వైద్యులు, యువజన విభాగం తదితర పార్టీ విభాగాల కార్యకర్తలు పాల్గొన్నారు. పోరూర్ కారంబాక్కంలో మాజీమంత్రి బెంజమెన్ నేతృత్వంలో నిర్వహించిన ఆందోళనలో పార్టీ సీనియర్ నేత తంగమణి తదితరులు పాల్గొన్నారు. మాధవరం మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలో మాజీమంత్రి మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన రాస్తారోకోలో వడకరై సుందర్, కావంగరై లయన్ జీ.మురళి సహా పాల్గొన్న 250 మంది కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. మాజీ మంత్రి వి.సోమసుందరం అధ్యక్షతన కాంచీపురం కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఆందోళనలో పాల్గొన్న సుమారు 300 మంది కార్యకర్తలను అరెస్ట్ చేశారు. అలాగే విల్లుపురం, తిరుచ్చి, మదురై, సేలం, శివగంగ, కృష్ణగిరి తదితర జిల్లాల్లో నిర్వహించిన ధర్నాలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న అన్నాడీఎంకే శ్రేణులను కూడా పోలీసులు అరెస్టు చేశారు.

**పోరాటం ఆగదు.. ఈపీఎస్**

అన్నా వర్సిటీ ప్రాంగణంలో అత్యాచారానికి గురైన విద్యార్థినికి న్యాయం జరిగే వరకు అన్నాడీఎంకే పోరాటం ఆగదని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రకటించారు. సోమవారం అత్యాచార ఘటనను ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనా కార్యక్రమాల్లో పాల్గొన్న పార్టీ కార్యకర్తలను అరెస్ట్ చేయడం సరికాదని ఈపీఎస్ పేర్కొన్నారు.





మాజీమంత్రి కేపీ మునుస్వామి సహా కార్యకర్తలను అరెస్టు చేస్తున్న పోలీసులు - మాజీమంత్రి తంగమణిని అరెస్ట్ చేస్తున్న దృశ్యం

## సమాచార దర్శిని

### 2 నుంచి సెమ్మొళిలో ఫ్లవర్ ఎగ్జిబిషన్

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక జెమినీ ఫ్లై ఓవర్ సమీపంలోని సెమ్మొళి పార్క్‌లో జనవరి 2వ తేది నుంచి ఫ్లవర్ ఎగ్జిబిషన్ జరుగనుంది. ఇందుకోసం రెండు నెలల నుంచి రాష్ట్రంలోని పలు ఉద్యాన వనశాఖ ఫాంలలో రకరకాలపూలు పెంచారు. ఈ ఎగ్జిబిషన్‌ను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించనున్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించవచ్చు. ఈ ప్రదర్శన 18వ తేది వరకు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

### 4న సైక్లింగ్ పోటీలు

పెరంబూర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా క్రీడా మైదానంలో ఈ నెల 4వ తేది సైక్లింగ్ పోటీలు జరుగనున్నాయి. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్ విడుదల చేసిన ప్రకటనలో.. మహిళలు, పురుషులకు వేర్వేరు విభాగాల్లో నిర్వహించనున్న ఈ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, 4 నుంచి 10 స్థానాల్లో నిలిచిన వారికి తలా రూ.250 అందించనున్నామన్నారు. ఈ పోటీల్లో దేశీయంగా తయారైన సైకిళ్ల మాత్రమే వినియోగించాలని, ఆసక్తి కలిగిన వారు జనవరి 3వ తేది సాయంత్రం 6గంటల్లోపు జిల్లా క్రీడా మైదానంలోని కార్యాలయంలో పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు జిల్లా క్రీడల అధికారి సేతురాజన్‌ను 7401703482 అనే నెంబరులో సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

### 7న ఎక్సైజ్ శాఖ వాహనాల వేలం

పెరంబూర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా ఎక్సైజ్ శాఖ పరిధిలోని వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 27 వాహనాలు జనవరి 7వ తేది వేలం వేయనున్నారు. కాంచీపురం తిరువీధిపల్లంలోకి ఎక్సైజ్ కార్యాలయం ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు వేలం జరుగనుంది. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు జనవరి 4 నుంచి 6 వరకు ఉదయం 10 గంటలకు ఆధార్ కార్డు నకలు, డిపాజిట్‌గా ద్విచక్రవాహనాలకు రూ.2 వేలు, మూడు చక్రాల వాహనాలకు రూ.5 వేలు, నాలుగు చక్రాల వాహనాలకు రూ.10 వేలు చెల్లించాలి. ఒక వ్యక్తి ఒకే టోకెన్ ఇస్తామని, టోకెన్ కలిగిన వ్యక్తి మాత్రమే పాల్గొనాలని, వేలంలో వాహనం కొనుగోలు చేయనివారికి డిపాజిట్ తిరిగి అందజేస్తామని అధికారులు తెలిపారు.

### పోలీసులకు ఉచిత బస్‌పాస్‌లు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణించేందుకు ఉచిత బస్ పాస్ కార్డులు అందజేయనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ తెలిపింది. కేసుల విచారణ నిమిత్తం కోర్టులకు వెళ్లే పోలీసులు మాత్రం, వారెంట్ చూపించి ప్రభుత్వ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సదుపాయం ఉంది. ఈ క్రమంలో, పలువురు పోలీసులు ఎలాంటి వారెంట్ లేకుండానే ఉచితంగా ప్రయాణిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో, ఆయా జిల్లాల పరిధిలో ఉచితంగా ప్రయాణించేందుకు పోలీసులకు ఉచిత బస్ పాస్ అందజేయనున్నట్లు రవాణా శాఖ తెలిపింది.

### ఉదయం 6 నుంచే రోప్‌కార్ సేవలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాణిపేట జిల్లా షోలింగర్ నరసింహస్వామి ఆలయానికి భక్తులు వెళ్లేందుకు ఏర్పాటుచేసిన రోప్‌కార్ సేవలు జనవరి 1వ తేది ఉదయం 6 గంటల నుంచే ప్రారంభం కానున్నాయి.. ఈ కొండ ఆలయానికి వెళ్లాలంటే 1,305 మెట్లు ఎక్కాల్సి ఉంది. వృద్ధులు, పిల్లల సంక్షేమార్థం రోప్‌కార్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ రోప్‌కార్ సేవలు ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటలు, శుక్రవారం రోజు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉన్నాయ. శుక్ర, శని, ఆదివారాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో, నూతన సంవత్సరం జనవరి 1వ తేది ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రోప్‌కార్ సేవలు అందుబాటులో ఉంటాయని ఆలయ అధికారులు తెలిపారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్

పెరంబూర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 175 ప్రభుత్వ మహోన్నత పాఠశాలల్లో రూ.57.80 కోట్లతో కంప్యూటర్ సైన్స్ ల్యాబ్‌లు ఏర్పాటుకానున్నాయి. రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో పాఠశాల విద్యాశాఖ పద్దుపై జరిగినచర్చల్లో ఆశాఖ మంత్రి అన్బిల్ మహేష్, ప్రభుత్వ ఉన్నత, మహోన్నత పాఠశాలల్లో కంప్యూటర్ సైన్స్ ల్యాబ్‌లు ఏర్పాటుచేయనున్నట్లు ప్రకటించారు. ఆప్రకారం,ప్రస్తుత విద్యా సంవత్సరం (2024-25) తొలివిడతగా ఐదుగురువిద్యార్థులకు ఒకకంప్యూటర్‌చొప్పున, 176 ప్రభుత్వ మహోన్నత పాఠశాలల్లో 12,043 కంప్యూటర్‌లతో కూడిన ల్యాబ్ ఏర్పాటుకు రూ.57.80 కోట్ల కేటాయించినట్లు పాఠశాల విద్య డైరెక్టరేట్ జీవో విడుదల చేసింది.

### కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కుంభమేళాకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్ల నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.06019 మంగళూరు సెంట్రల్-వారణాసి ప్రత్యేక రైలు జనవరి 18, ఫిబ్రవరి 15 తేదీల్లో మంగళూరు నుంచి తెల్లవారుజామున 4.15గంటలకుబయల్దేరి మూడో రోజు మధ్యాహ్నం 2.50గంటలకు వారణాసి చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06020 వారణాసి-మంగళూరు సెంట్రల్ ప్రత్యేక రైలు జనవరి 21, ఫిబ్రవరి 18వ తేదీల్లో వారణాసి నుంచి సాయంత్రం 6.20 గంటలకు బయల్దేరి నాలుగవరోజు వేకువజామున 2.30 గంటలకు మంగళూరు చేరుకుంటుంది. ఈ రైళ్లు సేలం, జోలార్‌పేట, కాట్పాడి, అరక్కోణం, పెరంబూర్, తిరువొత్తియూర్, గూడూరు, నెల్లూరు మీదుగా వెళ్లనున్నాయి. ఈ రైళ్లకు ముందస్తు రిజర్వేషన్ ప్రారంభమైంది.

# నత్తనడకన ఫ్లైఓవర్ నిర్మాణ పనులు

**● వరదనీటిలోనే సాగుతున్న అంతిమయాత్రలు**

టి.నగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పెరియపాళయం సమీపం ఆరణివాగుపై ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు నత్తనడక సాగుతున్నాయి. దీంతో ఆ పరిసరాల్లో మృతి చెందేవారి శవాలను ఆరణి వాగు ప్రవాహంలోనే మోసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని నగరి సమీపంలోని ఆరణియారు ఊత్తుకోట, పెరియపాళయం, పొన్నేరి తదితర ప్రాంతాల మీదుగా ప్రవహించి పళవేర్కాడు సరస్సులో కలుస్తోంది. ఆరణి వాగు ప్రస్తుతం ఈశాన్య రుతుపవన ప్రభావిత వర్షాల కారణంగా పొంగి ప్రవహిస్తోంది. ఆ వరద ప్రవాహంలో పెరియపాళయం సమీపంలో ఉన్న కొసవన్‌పేట, అంజాతమ్మన్ కోవిల్, పుదుపాళయం మధ్య ఉన్న కల్వర్టు రహదారి ఇదివరకే కురిసిన వర్షాలకు కొట్టుకుపోయింది. అంతే కాకుండా ఆరణి ప్రాంతంలోని మంగళం గ్రామానికి వెళ్లేందుకు స్థానికులు ఉపయోగించిన మట్టి రహదారి కూడా వరద ఉధృతిలో కొట్టుకుపోయింది. దీంతో పుదుపాళయం, మంగళం, కారణి, ఎరుక్కువాయి, నెలవాయి, ముక్కరంబాక్కం, చిన్నపులియూరు తదితర 10కి పైగా గ్రామాల ప్రజలు సుమారు 12 కి.మీ. దూరం ఉన్న ప్రత్యామ్నాయ మార్గంలో, ఆరణి, పొన్నేరి, చెన్నై తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఇదిలా ఉండగా కొద్ది రోజుల క్రితం ఆరణిలో ఓ మహిళ మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని ఆరణివాగు ఒడ్డున ఉన్న శ్మశానంలో దహనం చేయడానికి బంధువులు ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులోనే అష్టకష్టాలు పడి పాడె మోసుకెళ్ళారు. ఇలా మృతి చెందినవారి దేహాలను ఆరణి వాగునీటి ప్రవాహంలో మోసుకెళ్ళాల్సిన దుస్థితి నుండి బయటపడేలా అంజాతమ్మాన్ ఆలయం - పుదుపాళయం మధ్య నత్తనడక సాగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి తమకు రహదారి సదుపాయం కల్పించాలని ఆరణి పరిసర గ్రామాల ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆరణివాగు ప్రవాహంలోనే మృతదేహాన్ని మోసుకెళుతున్న స్థానికులు

## తీవ్ర ఉద్రిక్తతల నడుమ తమిళ వర్సిటీ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ పదవీ స్వీకారం

చెన్నై, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తంజావూరు తమిళ విశ్వవిద్యాలయంలో సోమవారం మధ్యాహ్నం తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నడుమ కొత్త ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వెట్రిసెల్వన్ పదవీ బాధ్యతలను చేపట్టారు. ఈ విశ్వవిద్యాలయంలో ఇన్‌ఛార్జి వీసీ శంకరన్, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ త్యాగరాజన్ మధ్య తీవ్ర స్థాయిలో విభేదాలు జరిగి, పరస్పరం డిస్మిస్ ఉత్తర్వులు ఇచ్చుకున్న సంగతి కూడా తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇన్‌ఛార్జి వీసీ శంకరన్ ఆదేశాల ప్రకారం వెట్రిసెల్వన్ సోమవారం ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా పదవీ బాధ్యతలు చేపట్టేందుకు వెళ్ళారు. ఆ సమయంలో రిజిస్ట్రార్ గదికి తాళం పెట్టి త్యాగరాజన్ వెళ్ళిపోయారు. దీంతో సిబ్బంది ఆ గది తాళాన్ని పగులగొట్టి తలుపులు తెరిచారు. ఆ తర్వాత వెట్రిసెల్వన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా త్యాగరాజన్ మద్దతుదారులుగా వ్యవహరిస్తున్న ఉద్యోగులు కొందరు వెట్రిసెల్వన్ పదవీబాధ్యతలు స్వీకరించకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఆ విశ్వవిద్యాలయంలో ఉన్న పోలీసులు పరిస్థితిని చక్కదిద్దారు. ఆ తర్వాత త్యాగరాజన్ రిజిస్ట్రార్ గదికి కొస్త దూరంలో ఉన్న మరో గదిలో కూర్చున్నారు. ప్రస్తుతం ఆ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండటంలో పోలీసు ఉన్నతాధికారులు భద్రత మరింత పెంచారు.



తాళం పగులగొట్టి రిజిస్ట్రార్ రూమ్ తెరిచేందుకు ప్రయత్నిస్తున్న సిబ్బంది

### రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ



కుట్టుమిషన్ల పంపిణీ చేస్తున్న రోటరీ ప్రతినిధులు

చెన్నై, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): 'రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్' ఆధ్వర్యంలో సోమవారం 200 మంది పేద మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ జరిగింది. సెంబాక్కం, రోటరీ నగర్‌లలో క్లబ్ అందించే టైలరింగ్ కోర్సు విజయవంతంగా పూర్తి చేసిన మహిళలందరికీ మిషన్లు అందించింది. ఎంజీఆర్ జానకి కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ శరవణన్, రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ అధ్యక్షుడు రొటేరియన్ చెల్లా కృష్ణ తదితర ప్రముఖులు హాజరై కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చెల్లా కృష్ణ మాట్లాడుతూ.. బలహీన వర్గాలకు సాధికారత కల్పించేందుకు రోటరీ క్లబ్ కట్టుబడి వుందని పునరుద్ఘాటించారు. యాక్సెస్ హెల్త్‌కేర్ వంటి కార్పొరేట్ భాగస్వాములు సహకరించడంవల్ల లబ్ధిదారుల జీవితాలను మెరుగుపరిచే వనరులను తాము విస్తరించగలుగుతున్నామని వివరించారు.

### వైభవంగా హనుమజ్జయంతి



హనుమాన్ సేవా సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు

వేలూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక తోటపాళ్యం హనుమాన్ సేవా సంఘం ఆధ్వర్యంలో పెరుమాళ్ ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా హనుమంతుడికి ప్రత్యేక అభిషేకాలు, మహా దీపాధాన చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బాబు, నిర్వాహకులు భాస్కర్, ప్రభు, నారాయణన్, మహేంద్రన్ సహా పలువురు పాల్గొన్నారు. అలాగే, కాట్పాడి చిత్తూర్ బస్టాండ్ సమీంపలోని భక్తాంజనేయ ఆలయంలో అంజనేయుడికి బంగారు కవచంతో ప్రత్యేక అలంకరణ, దీపారాధన జరిగాయి.

### పల్లిపట్టులో హనుమాన్ రథయాత్ర



రథయాత్రలో పాల్గొన్న భక్తులు

తిరుత్తణి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా పల్లిపట్టు నగరి రోడ్డు సమీపం ఆంజనేయనగర్‌లో ఉన్న వీరమంగళ ఆంజనేయ ఆలయంలో సోమవారం హనుమద్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉత్సవమూర్తికి పంచ తీర్థాలతో అభిషేకం నిర్వహించి, పుష్పాలు, తులసి మాలలు, వడమాలతో అలంకరించారు. అనంతరం పురవీధుల్లో రథయాత్ర నిర్వహించారు. వేడుకల్లో హేమాద్రి, శ్రీనివాసన్, పురుషోత్తమన్, శివకుమార్, మోహన్‌రెడ్డి, లోకనాథన్, బాల, దేవ, భరత్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ఐస్టీల్ వార్షికోత్సవం




అడయార్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఐరన్ రాడ్స్ (ఇనుప చువ్వల) తయారీ కంపెనీల్లో ఒకటైన టీఎంటీ బార్స్ (ఐస్టీల్) 20వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. దక్షిణ భారతదేశంలో ప్రముఖ కంపెనీగా గుర్తింపు పొందిన ఐస్టీల్ ఉత్పత్తి చేసిన ఇనుప రాడ్లను ఉపయోగించి దాదాపు 5 లక్షలకుపైగా గృహాలను నిర్మించారు. ప్రస్తుతం 20వ వార్షికోత్సవాన్ని జరుపుకున్న శుభతరుణంలో తమ ఉత్పత్తి 2.4 లక్షల టన్నులకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఈ కంపెనీ సీఈవో జి.గౌతం రెడ్డి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. 2005 నుంచి నాణ్యమైన ఐరన్ రాడ్లను ఉత్పత్తి చేస్తున్నామని, వీటిని ఉపయోగించి దక్షిణాది రాష్ట్రాల్లో 5 లక్షలకు పైగా గృహాలను నిర్మించినట్లు వెల్లడించారు. అంతేకాకుండా పర్యావరణ పరిరక్షణ చర్యల్లో భాగంగా కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు 16 ఎకరాల విస్తీర్ణంలో 11 వేల సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

### అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఆందోళన



ఆందోళనలో నేతలు, కార్యకర్తలు

వేలూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అన్నా యూనివర్సిటీ విద్యార్థినిపై లైంగిక వేధింపులు, డీఎంకే ప్రభుత్వ తీరును నిరసిస్తూ అన్నాడీఎంకే ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ సమీపంలో జిల్లా సెక్రటరీ అప్పు అధ్యక్షతన జరిగిన ఆందోళనలో జిల్లాప్రతినిధి ఉమానాథ్, జాయింట్‌సెక్రటరీ భాస్కర్, ఐటీవింగ్ మండల సెక్రటరీ సతీష్‌కుమార్, మాజీ జిల్లా సెక్రటరీ మూర్తి, న్యాయవాదుల విభాగం సెక్రటరీ దాస్ సహా 500 మందికి పైగా కార్యకర్తలు పాల్గొన్నారు. అనుమతులు లేకుండా ఆందోళన చేపట్టారంటూ నేతలు, కార్యకర్తలు పోలీసులు అరెస్ట్ చేశారు.

### పోలీసు భద్రత నడుమ పొంగల్ గిఫ్ట్ ప్యాక్



పెరంబూర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పొంగల్ గిఫ్ట్ ప్యాక్ అందించే రేషన్ దుకాణాల్లో అవసరమైతే పోలీసు భద్రత ఏర్పాటు చేసుకోవాలని సహకార శాఖ రిజిస్ట్రార్ సుబ్బయ్యన్ తెలియజేశారు. సహకార శాఖ జాయింట్ రిజిస్ట్రార్లకు ఆయన ఉత్తర్వులో... పొంగ్ గిఫ్ట్ ప్యాక్ పంపిణీ వచ్చే నెల 9 నుంచి ప్రారంభమవుతుందని, అంతకు ముందు రేషన్ కార్డుల ఇళ్లకు వెళ్లి టోకెన్లు ఇవ్వాలన్నారు. టోకెన్లలో సరకులు పొందే తేది, సమయం ఉండాలని సూచించారు. తొలిరోజు ఉదయం, మధ్యాహ్నం తలా 100 మంది, రెండవ రోజు ఉదయం 150, మధ్యాహ్నం 200 మందికి సరుకులు అందజేసేలా చర్యలు చేపట్టాలన్నారు. 1,500లకు పైగా రేషన్ కార్డులున్న దుకాణాల్లో అదనపు సిబ్బందిని నియమించాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరిగే అవకాశమున్న రేషన్ దుకాణాల వద్ద తగిన భద్రత కల్పించేలా పోలీసు శాఖను కోరాలన్నారు. ప్రతిరోజు ఎంతమందికి గిఫ్ట్ ప్యాక్ అందించారు అన్న వివరాలు అదే రోజు సాయంత్రం 5 గంటలకు పంపించాలని ఆయన పేర్కొన్నారు.

### దక్షిణాదిలో 25 ఎస్ఎస్‌కేఎల్ షాపులు



అడయార్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సాయి సిల్క్స్ (కళామందిర్) (ఎస్ఎస్‌కేఎల్) షోరూమ్‌లను దక్షిణ భారతదేశ వ్యాప్తంగా ప్రారంభించనున్నట్టు ఎస్ఎస్‌కేఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రసాద్ చలవాడి వెల్లడించారు. అడయారులో కాంచీపురం వరమహాలక్ష్మి సిల్క్స్ షోరూమ్‌ను ధరుమై ఆధీనం, 27వ గురు మహా సన్నిధానం కలై మాసిలామణి దేవిక జ్ఞానసంబధ పరమాచార్య స్వామిగళ్ ఇటీవల ప్రారంభించారు. ఇది నగరంలో ప్రారంభించిన ఆరో షోరూమ్. ఇక్కడ బెనారసి, పటోలా, కోట, కాంచీపురం, పైథాని, కుప్పడం వంటి అనేక రకాలైన చీరలు లభ్యమవుతాయని ప్రసాద్ చలవాడి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. తమకు నానాటికీ పెరుగుతున్న కొనుగోలుదారుల సంఖ్యను, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు వీలుగా తమ సేవలను విస్తరిస్తామన్నారు. ఇందులోభాగంగా దక్షిణ భారతదేశ వ్యాప్తంగా వచ్చే రెండు ఆర్థిక సంవత్సరాల్లో 25 షోరూమ్‌లను ప్రారంభించనున్నట్టు ఆయన వివరించారు.

### సమాజంలో సేవా గుణం పెరగాలి

**● అన్నా వర్సిటీ ప్రొఫెసర్ డా.సురేష్ కన్నన్**



ఎస్ఎస్ఎస్ విద్యార్థులతో సురేష్ కన్నన్, తాడేపల్లి రాజశేఖర్ తదితరులు

ప్యారీస్, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతి ఒక్కరిలో సేవా గుణం పెరగాలని అప్పుడే ఇతరుల కష్టాల్లో మనం కూడా భాగస్వాములు కాగలమని అన్నా వర్సిటీ ప్రొఫెసర్ డా.సురేష్ కన్నన్ అన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్-10 విభాగానికి చెందిన 65 మంది విద్యార్థిని, విద్యార్థులు తిరువళ్లూర్ జిల్లా వడపెరుంబాక్కం ప్రాంతంలోని పాఠశాలలు, ఆలయాలు, లైబ్రేరీలు, పార్కులను శుభ్రపరచే కార్యక్రమం ఈ నెల 25న ప్రారంభమై సోమవారం ముగిసింది. వడపెరుంబాక్కంలో పునఃనిర్మించిన గ్రంథాలయాన్ని కౌన్సిలర్ జయశంకర్, డా.సురేష్ కన్నన్, జయరాజ్ గ్రూప్ కంపెనీల ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ తాడేపల్లి రాజశేఖర్ ప్రారంభించి పుస్తకాలు విరాళంగా అందజేశారు. అనంతరం అతిథులు, విద్యార్థులకు జ్ఞాపికలందజేసి సన్మానించారు.

## ఘనంగా ముగిసిన విశ్వకళా సంగమ సంగీతోత్సవం

ప్యారీస్, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విశ్వకళా సంగమ ఆధ్వర్యంలో నిర్వహించిన మూడురోజుల 25వ వార్షిక సంగీతోత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఆళ్వార్‌పేటలోని ట్యాగ్‌సెంటర్ వేదికగా నిర్వహించిన స్వామి హరిదాస్ సంగీతోత్సవాన్ని ఈ నెల 27న ప్రముఖ సితార విద్వాంసులు జనార్ధన్ మిట్టా ప్రారంభించారు. రెండు రోజులు హిందుస్థానీ జుగల్బందీ శ్రోతలను మంత్రముగ్ధులను చేసింది. ఆదివారం సాయంత్రం 5 గంటలకు ముగింపు కార్యక్రమంగా నిర్వహించిన సరోగి గాత్రకచ్చేరిలో ముందుగా మోనాలి బాలా (గాత్రం), మనోన్మణి (సారంగి), జే.పార్థసారధి (తబలా), రెండవదిగా సిద్ధార్థ బెల్‌మన్ (గాత్రం), సర్వరాజ్ ఖాన్ (సారంగి), పండిట్ రవీంద్ర యావగళ్ (తబలా)తో వాయిద్యసహకారం అందించారు. విశ్వకళా సంగమ వ్యవస్థాపకులు పండిట్ జనార్ధన్ మిట్టా, ఊరా లక్ష్మీనరసింహారావు - హేమలత దంపతులు కళాకరులను ఘనంగా సత్కరించారు. హిందుస్థానీ సంగీతం మాధుర్యాన్ని సంగీత ప్రియులకు అందజేయాలనే లక్ష్యంతో నిర్వహించిన సంగీతోత్సవాల విజయవంతం కావడానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మూడు రోజుల కార్యక్రమాల ఏర్పాట్లను ఊరా అంజనేయులు, ఊరా వెంకటేశ్వర్లు, కె.శారద తదితరులు పర్యవేక్షించారు.



సిద్ధార్థ బెల్‌మన్ బృందగానం

### వడపళని ఆలయానికి బాంబు బెదిరింపు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళని మురుగన్ ఆలయానికి వచ్చిన బాంబు బెదిరింపు కలకలం రేపింది. ఆదివారం అర్ధరాత్రి 12.15 గంటలకు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసిన గుర్తుతెలియని వ్యక్తి, వడపళని మురుగన్ ఆలయంలో బాంబు ఉంచినట్లు చెప్పి ఫోన్ కట్ చేశాడు. దీంతో, పోలీసులు, డాగ్‌స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ నిపుణులు హుటాహుటిన ఆలయానికి చేరుకున్నారు. ఆ సమయంలో ఆలయం మూసి ఉండడంతో, పరిసర ప్రాంతాల్లో వారు తనిఖీ చేశారు. తెల్లవారుజామున 4 గంటలకు ఆలయం తెరచిన వెంటనే లోనికి వెళ్లిన పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఉదయం 6 గంటల వరకు జరిగిన తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థం లభ్యం కాకపోవడంతో, బాంబు బెదిరింపు ఫేక్ కాల్‌గా నిర్ధారించారు. అలాగే, ఫోన్ చేసిన వ్యక్తి గురించి వడపళని పోలీసులు విచారణ చేపట్టారు.

### కారు ఢీకొని భక్తుడి మృతి

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పాదయాత్రగా వెళ్తున్న భక్తులను కారు ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా, మరో ఐదుగురికి గాయాలయ్యాయి. తిరుప్పూర్ జిల్లా తారాపురంలోని మురుగన్ ఆలయానికి భవాని కూట్‌కల్లై ప్రాంతానికి చెందిన 80 మంది భక్తులు పాదయాత్రగా బయల్దేరారు. వారు సోమవారం ఉదయం తారాపురం బైపాస్ రోడ్డు మీదుగా వరపాళయం ప్రాంతంలో వెళుతున్న సమయంలో కారు వారిపై దూసుకెళ్లింది. ఈ ఘటనలో రామన్ (54) అనే భక్తుడు ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. అలాగే, కారు డ్రైవర్ విలయన్, భక్తులు పొన్నుస్వామి, సుందరం,దురయన్, అముదరాజ్‌లకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

### తిరుచ్చిలో 2,447 తాబేళ్లు స్వాధీనం

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి విమానాశ్రయంలో 2,447 తాబేళ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కౌలాలంపూర్ నుంచి తిరుచ్చికి ఆదివారం వచ్చిన ప్రయాణికుల లగేజీ కస్టమ్స్ అధికారులు తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఓ ప్రయాణికుడు తెచ్చిన చాక్లెట్ బాక్స్‌ల్లో తాబేలు పిల్లలను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకున్న అధికారులు, అతనిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

### నీటమునిగి బాలుడి మృతి

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పళవేర్కాడు సమీపంలో నీటమునిగి బాలుడు మృతిచెందిన ఘటన విషాదానికి దారితీసింది. ప్రళయంబాక్కం గ్రామానికి చెందిన ముకిలన్ (14) తన స్నేహితులతో కలసి అదే ప్రాంతంలోని చెరువులో స్నానానికి వెళ్లాడు. స్నానం చేస్తుండగా ముకిలన్ నీటమునిగాడు. సహచరుల కేకలతో అక్కడకు చేరుకున్న చుట్టుపక్కల వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకొని గంట సేపు గాలించి ముకిలన్ మృతదేహం వెలికితీసారు. స్థానిక పోలీసులు ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

### జాలరి వలలో చిక్కిన మృతదేహం

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జాలరి వలలో మృతదేహం చిక్కుకున్న వ్యవహారం కలకలంరేపింది. పుదుకోట జాలర్లు రెండ్రోజుల కిందట చేపలవేటకు సముద్రంలోకి వెళ్లారు. సోమవారం తీరానికి చేరుకున్న జాలర్లు వలలు పరిశీలిస్తుండగా, ఓజాలరి వలలో పురుషుడి మృతదేహం ఉం డడం చూసి దిగ్భ్రాంతి చెందారు. సమాచారం అందుకున్న తీరప్రాంత పోలీసులువెళ్లి మృతదేహం స్వాధీనం చేసుకొని, కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

### పంచలింగం జలపాతం వెళ్లేందుకు నిషేధం

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా ఉడుమలైపేట సమీపంలోని తిరుమూర్తి కొండల్లో ఉన్న పంచలింగం జలపాతం వద్దకు పర్యాటకులు వెళ్లేందుకు నిషేధం విధించారు. ఈ జలపాతం చూసేందుకు చుట్టుపక్కల జిల్లాలకు చెందిన పర్యాటకులు వస్తుంటారు. ప్రస్తుతం సెలవులు కావడంతో పర్యాటకులు రద్దీ అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో, రెండు రోజులుగా ఈ కొండ ప్రాంతాల్లో భారీవర్షాలు కురుస్తుండడంతో జలపాతం వద్ద వరద ఉధృతి అధికంగా ఉండడంతో, పర్యాటకుల స్నానాలకు నిషేదం విధిస్తున్నట్లు జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది.

### గొర్రె విక్రయించారని విద్యార్థి ఆత్మహత్య



ఉలగనాథన్ (ఫైల్ ఫొటో)

పెరంబూర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రేమగా పెంచుకుంటున్న గొర్రెను తల్లిదండ్రులు విక్రయించడంతో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తిరునల్వేలి జిల్లాలో చోటుచేసుకుంది. గంగైకొండాయన్ సమీపం వెంకటాచలపతి గ్రామానికి చెందిన సుబ్బయ్య కుమారుడు ఉలగనాదన్ (15) అదే ప్రాంతంలో 10వ తరగతి చదువుతున్నాడు. ఇంట్లో పెంచుతున్న గొర్రెతో ఉలగనాథన్ ప్రేమగా ఉండేవాడు. ఈ నేపథ్యంలో, కొద్దిరోజుల క్రితం అతడి తల్లి గొర్రెను విక్రయించినట్లు తెలిసింది. దీంతో, మనస్తాపం చెందిన ఉలగనాథన్ ఆదివారం ఇంట్లో విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

### బధిర పిల్లలకు 'కాక్లియర్ ఇంప్లాట్' పరికరం

పెరంబూర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పుట్టుకతోనే వినికిడి లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారికి ఉచితంగా 'కాక్లియర్ ఇంప్లాట్ పరికరం అమర్చనున్నట్లు అందించనున్నారు. ఈ మేరకు ఆరోగ్య శాఖ కార్యదర్శి సుప్రియ సాహు విడుదల చేసిన ప్రకటనలో... వినికిడిలోపం ఉన్న పిల్లలకు ఈ చికిత్స ద్వారా లోపం సరిచేయవచ్చన్నారు. ఇటీవల చేపట్టిన సర్వేలో 1,007 పిల్లలు ఈ లోపంతో ఉన్నారని, వారిలో 170 మందికి వైద్య పరీక్షలుచేసి జనవరిలో 31 మందికి ఈ పరికరం అమర్చే చికిత్స చేపట్టనున్నామన్నారు. ఈ చికిత్సకు ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ.6.5 లక్షలు ఖర్చవుతుండగా, ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా అందిస్తున్నామని సుప్రియ సాహు తెలిపారు.

### టెన్త్ విద్యార్థుల జాబితా సవరణకు అవకాశం

పెరంబూర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): టెన్త్ పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థుల జాబితాలో సవరణ చేసుకొనేందుకు జనవరి 2వ తేది వరకు అవకాశం కల్పించారు. ఈ మేరకు పరీక్ష శాఖ డైరెక్టర్ ఎన్.లత జిల్లా ప్రధాన విద్యాధికారులకు పంపిన సర్క్యులర్‌లో... రాష్ట్రంలో ప్రస్తుత విద్యా సంవత్సరం పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల జాబితా ఈ నెల 24న విడుదల చేశామన్నారు. ఈ జాబితాలో విద్యార్థుల పేర్లు, ఇతర వివరాల్లో తప్పులు దొర్లితే, జనవరి 2వ తేదిలోగా సవరించాలని, పాఠశాలకు ఎక్కువ రోజులు రాని విద్యార్థుల పేర్లు తొలగించరాదని, అందుకు పాఠశాల విద్య అధికారి అనుమతులు తీసుకున్న తర్వాతే అలాంటి చర్యలు చేపట్టాలని పరీక్ష శాఖ తెలియజేసింది.

### పాఠ్యాంశంగా నల్లకన్ను జీవితచరిత్ర

**● పరిశీలిస్తామన్న మంత్రి**

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నేత నల్లకన్ను జీవిత చరిత్రను పాఠ్యాంశంగా రూపొందించడంపై పరిశీలిస్తామని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు. నల్లకన్ను 100వ జన్మదిన వేడుకలు ఆదివారం నగరంలో జరిగాయి. ఈ వేడుకల్లో పాల్గొన్న నటుడు విజయ్‌సేతుపతి, నల్లకన్ను జీవిత చరిత్ర ఆదర్శమని, ఆయన చరిత్రను విద్యార్థులు తెలుసుకొని స్ఫూర్తిపొందేలా పాఠ్యాంశంగా చేర్చాలని కోరారు. ఈ విషయమై మంత్రి అన్బిల్ మహేష్ మాట్లాడుతూ... నల్లకన్ను జీవిత చరిత్ర పాఠ్యాంశంగా రూపొందించడంపై ముఖ్యమంత్రి స్టాలిన్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

### అలరించిన శంకరప్రకాశ్ వీణా వాదం



చెన్నై, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక టినగర్ టీజీఎ ఆడిటోరియంలో 'మార్గ' సభ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన 'మధురవైజీక బోనాల శంకరప్రకాశ్ వీణావాదం రసజ్ఞులను అలరించింది. 'ఇంత చల ము..' బేగడరాగం ఆదితాళంలో వీణకుప్పయ్యర్ రచనలోవర్ణంతో ప్రారంభించి, గౌళరాగంలో 'ప్రణమామ్యహం శ్రీగౌరి సుతం', నాగస్వరావళి రాగంలో 'గరుడ గమన సమయమిదే' వాయించారు. ప్రధానాంశంగా 'ఎవరి మాట విన్నావో..' కాంభోజరాగంలో త్యాగరాజ స్వామి కీర్తన వాయించారు. వీరు నాలుగు స్థాయిల్లో అలవోకగా వీణమీద గమకాలు పలికించగలిగే అరుదైన వైణికులు. వీరికి వయోలిన్‌పై మైసూర్ శ్రీకాంత్, మృదంగంపై పత్రి సతీష్ కుమార్, ఘటంపై సురేష్ వైద్యనాథన్ వాద్య సహకారం అందించారు

# ఎన్నో వింతలు మరెన్నో విశేషాలు

వింతలు విశేషాలకు తమిళనాడులో కొదవేముంది?.. పూజలైనా, రాజకీయాలైనా, మరేదైనా వాటికి ఎనలేని ప్రత్యేకత వుంటుంది. అందుకే తమిళనాడులో జరిగే ఘటనల పట్ల యావద్దేశం ఆసక్తి కనబరుస్తుంది. 2024లో నెలకొన్న ఎన్నో వింతలు, విశేషాల సమాహారం మీ కోసం..

- చెన్నై, ఆంధ్రజ్యోతి



## 2024 విశేషాల సమాహారం

### జనవరిలో..

## నడుముకు తాడుకట్టుకుని కారును లాగిన బాలుడు



శివగంగ జిల్లాకు చెందిన మోహన్‌రాజ్-మారీశ్వరి దంపతుల కుమారుడు దేవసుగన్ (7) నడుముకు తాళ్లు కట్టుకొని కారు లాగి చోళన్ ప్రపంచ రికార్డ్స్ బుక్‌లో స్థానం పొందాడు. 2 నిమిషాల 47 సెకన్లలో 220 మీటర్ల దూరం వరకు 900 కిలోల బరువు కలిగిన కారును తాళ్లతో లాగి ఆ బుడతడు రికార్డు నెలకొల్పాడు.

## పాత్తేరిలో 'రైల్ కోచ్ రెస్టారెంట్'





చెంగల్పట్టు జిల్లా పొత్తేరిలో ప్రైవేటు భాగస్వామ్యంతో దక్షిణ రైల్వే సంస్థ రైలు బోగీని తలపించేలా రైల్వే కోచ్ రెస్టారెంట్ ప్రారంభించింది. రూ.1.5 కోట్లతో నిర్మించిన ఈ రెస్టారెంట్‌కు 'ఎన్.హెచ్ 32' అని పేరుపెట్టారు. ఈ రెస్టారెంట్‌లో భారతీయ, చైనీస్, ఇటాలియన్ వంటకాలతోపాటు పిజ్జా, బర్గర్, నూడుల్స్ తదితర మాంసాహార భోజనాలు వడ్డిస్తున్నారు.

## 'వెన్నెల పిల్ల'కి గ్రామస్తుల పూజలు



దిండుగల్ జిల్లా కోట్టూరు గ్రామంలో తైపూసం రోజున జయప్రకాశ్- సుధ దంపతుల కుమార్తె 11 ఏళ్ల యాళినిని 'వెన్నెల పిల్ల'గా ఎంపిక చేసి, ఆమెను అలంకరించి, నెత్తిన అవే పూల బుట్ట పెట్టి ఊరేగించారు. ఇలా చేయడం వల్ల వర్షాలు బాగా కురిసి పంటలు పండుతాయని గ్రామస్థుల నమ్మకం..

## నీలాంగరై తీరంలో డాల్ఫిన్ల సందడి



చెన్నై స్థానిక నీలాంగరై సముద్రతీరంలో ఒకేసారి 10 డాల్ఫిన్లు సందడి చేశాయి. విన్యాసాలు చేస్తున్న డాల్ఫిన్లను ఆ ప్రాంత ప్రజలు, పర్యాటకులు ఆశ్చర్యంగా వీక్షించారు.

## పొల్లాచ్చిలో బెలూన్ల పండుగ ప్రారంభం



కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చిలో తొమ్మిదివ అంతర్జాతీయ బెలూన్ల పండుగ జరిగింది. రాష్ట్ర పర్యాటక అభివృద్ధిశాఖ, ఓ సంస్థ కలిసి ఫ్రాన్స్, నెదర్లాండ్, స్పెయిన్, జపాన్, థాయ్‌లాండ్, వియత్నాం సహా ఎనిమిది దేశాల నుండి 11 బెలూన్లను తెప్పించి ఎగురవేశారు.

### మేలో..

## తెల్ల బర్రెకు జన్మనిచ్చిన నల్ల బర్రె

కరూరు జిల్లా నొయ్యల్ సమీపం సేమంగి ప్రాంతానికి చెందిన మురుగేశన్ అనే రైతు పెంచిన నల్ల బర్రె తెల్ల బర్రెకు జన్మనిచ్చింది. ఆ ఊరి వారంతా ఈ తెల్ల బర్రెను చూడటానికి బారులు తీరారు.

## చేతులు లేని యువకుడికి డ్రైవింగ్ లైసెన్స్



ప్రమాదంలో చేతులు కోల్పోయిన వ్యాసర్పాడి పెరియార్ నగర్‌కు చెందిన తాన్సేన్ (31) ఆత్మవిశ్వాసంతో కాళ్లతో డ్రైవింగ్ నేర్చుకొని డ్రైవింగ్ లైసెన్స్ కూడా పొందాడు. ప్రస్తుతం ఎంఎల్ కోర్సు చదువుతున్న తాన్సేన్ ఆత్మస్థయిర్యాన్ని చూసి నగరవాసులు ప్రశంసిస్తున్నారు.

### జూన్‌లో..

## కోవై బోట్ హౌస్‌లో వింత పడవ



కోయంబత్తూర్ బోట్‌హౌస్‌లో కొత్త రకం పడవ అందుబాటులోకి వచ్చింది.. ప్రస్తుతం ఆ బోట్‌హౌస్ వద్ద షార్క్ చేప ఆకారంలో పడవను పర్యాటకులు బర్త్‌డే, వెడ్డింగ్‌డే వేడుకల కోసం అధికారులు సిద్ధం చేశారు.

### జూలైలో..

## జంబుకేశ్వరంలో మోగనున్న గంట



తిరుచ్చి సమీపం తిరువానైక్కావల్ జంబుకేశ్వరాలయంలో మూడు దశాబ్దాల తర్వాత కంచుగంట మోగనుంది. కొంతమంది దాతలు ఇచ్చిన రూ.12.50 లక్షల విరాళంతో కొత్త గంట తయారు చేశారు. ప్రత్యేక పూజల సమయంలో ఈ కొత్తగంటను మోగిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

### ఆగస్టులో

## చెన్నై నుంచి దూసుకెళ్లిన హైబ్రిడ్ రాకెట్



చెంగల్పట్టు జిల్లా తయ్యూరు సమీపం పట్టిపుల్లంలో భారత దేశపు తొలి పునర్వినియోగ హైబ్రిడ్ రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. శాస్త్ర సాంకేతిక నిపుణుల నిర్దేశిత పథకం ప్రకారం ఆ రాకెట్ మూడు ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రవేశపెట్టిన తర్వాత భూమి వైపు తిరిగొచ్చి బంగాళాఖాతంలో పడింది. ఈ కార్యక్రమంలో చంద్రయాన్-1 ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ మయిల్‌సామి అన్నాదురై, మంత్రి మెయ్యనాథన్ తదితరులు పాల్గొన్నారు.



హైబ్రిడ్ రాకెట్ ప్రయోగాన్ని తిలకిస్తున్న చంద్రయాణ్-1 ప్రాజెక్ట్ డైరెక్టర్ మయిల్‌సామి అన్నాదురై, మంత్రి మెయ్యనాథన్

### సెప్టెంబరులో

## తొలిసారి చెన్నైలో ఫార్ములా-4 కార్ రేసు

చెన్నై నగరంలో తొలిసారిగా నిర్వహించిన ఫార్ములా-4 కార్ రేస్‌కు నగరవాసుల నుండి మంచి స్పందన లభించింది. తమిళనాడు క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి తీవ్ర ప్రయత్నాల నడుమ దక్షిణాసియాలోనే తొలిసారిగా నగరంలో రాత్రి వేళ ఈ రేస్‌లు జరిగాయి.

## ఆలయ కుంభాభిషేకానికి సారె తీసుకొచ్చిన ముస్లింలు



తిరుప్పూర్ జిల్లా మంగలం ప్రాంతంలో శ్రీదేవి, భూదేవి సమేత ఆదికేశవ పెరుమాళ్ మహా కుంభాభిషేకానికి ఆ గ్రామానికి చెందిన ముస్లింలు సున్నత్వల్ జమా అత్ పెద్ద మసీదు నుంచి సారె వస్తువులను మేళతాళాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించడం మత సామరస్యతను ఎలుగెత్తి చాటింది.

### ఫిబ్రవరిలో..

## జయ రూపంలో భారీ కేక్



మాజీ ముఖ్యమంత్రి జయలలిత జయంతి సందర్భంగా తిరుప్పరంగుండ్రం మాజీ ఎమ్మెల్యే శరవణన్ 300 కిలోల బరువు, ఆరున్నర అడుగుల ఎత్తుతో జయలలిత రూపంతో భారీ కేక్‌ను తయారు చేశారు.

## సముద్రగర్భంలో కథారచన



రాణిపేట జిల్లా తిమిరి గ్రామానికి చెందిన గజ ఈతగాడైన దివ్యాంగుడు మణి ఎళిలన్ నీలాంగరై వద్ద సముద్రం అడుగున నీటిలో వినియోగించే కలంతో ఓ కథ రాశి మిత్రుల సాయంతో ఆ కథను పుస్తకరూపంగా మార్చి సముద్రంలోనే ఆవిష్కరించాడు.

## వెయ్యిమందితో నృత్య ప్రదర్శన



పళని పర్వతాలయం దిగువ గిరివీధిలోని అళగునాచ్చియప్పన్ ఆలయం వద్ద ప్రపంచ రికార్డు కోసం రాష్ట్రం నలమూలల నుండి వచ్చిన వెయ్యిమంది కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు. తిరుపుగళ్, కావడిసింధు ప్రధాన అంశాలుగా చేసుకుని నృత్యకళాకారిణులు ఈ నృత్యం చేశారు.

### మార్చిలో..

## 9 నిమ్మపండ్లు రూ.2.36 లక్షలకు వేలం



నిమ్మపండ్లను వేలం వేస్తున్న ఆలయ అర్చకులు

విల్లుపురం జిల్లా తిరువెన్నైనల్లూరు సమీపంలోని రత్నవేల్ మురుగన్ ఆలయంలో పంగుణి ఉత్తిరం ఉత్సవాల సందర్భంగా ఆలయంలో శూలాయుధానికి గుచ్చిన 9 నిమ్మపండ్లను తొమ్మిది మంది భక్తులు రూ.2.36లక్షలకు వేలంపాడి దక్కించుకున్నారు.

### ఏప్రిల్

## వరి బస్తాలు మోసిన పుదువై మాజీ మంత్రి





పుదుచ్చేరి మాజీ మంత్రి కమల్‌కన్నన్ వడ్లమూటలు మోసే దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పుదుచ్చేరి గత కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయ, పాఠశాల విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన కమల్‌కన్నన్ ప్రస్తుతం వ్యవసాయం చేస్తున్నారు. ట్రాక్టర్‌లో పొలం నుండి వడ్ల బస్తాలను ఇంటికి తరలించి వాటిని ఆయనే మోసుకెళుతున్న దృశ్యాల వీడియో కలకలం రేపింది.

### అక్టోబర్‌లో..

## వాయుసేన విన్యాసాలు



భారత వైమానిక దళం 92 యేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా చెన్నై మెరీనాతీరంలో నిర్వహించిన వాయుసేన విన్యాసాలు ఆద్యంతమూ అబ్బురపరిచాయి. ఈ ప్రదర్శనను సుమారు 15 లక్షల మందికిపై వీక్షించడం లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించుకుంది.

## నావికా దళానికి మల్టీ పర్పస్ షిప్'



చెన్నై శివారు ప్రాంతమైన కాట్టుపల్లి షిప్ యార్డులో 'మల్టీ పర్పస్ షిప్' అనే కొత్త నౌకను భారత నౌకాదళం పరిచయం చేసింది. భారత నావికాదళానికి పలురకాల నౌకలు తయారుచేసేందుకు, సైనిక మంత్రిత్వశాఖ, ఎల్ అండ్ టీ సంస్థల మధ్య ఒప్పందం జరిగింది. ఆ ప్రకారం తయారుచేసిన 'ఐఎన్ఎస్ సమర్థక్' పేరుతో కొత్త నౌక పరిచయం కాట్టుపల్లిలో జరిగింది.

### డిసెంబర్‌లో...

## శాంతికోసం వేప,మర్రి చెట్లకు పెళ్లి



కృష్ణగిరి జిల్లా సుట్టికాడు గ్రామంలో ప్రపంచ శాంతి కోరుతూ మర్రి, వేప చెట్లకు గ్రామస్తులు వివాహం జరిపించారు. ప్రపంచ శాంతి కోరుతూ గ్రామంలోని ఆలయ ప్రాంగణంలో ఉన్న మర్రి చెట్టు, పార్వతి స్వరూపమైన వేప చెట్టుకు తిరుకల్యాణం నిర్వహించారు.

## జీపీఎస్‌తో వాలిన 'డేగ'

కడలూరు జిల్లా పన్రుట్టి సమీపంలో చిత్తిరైచావిడి గ్రామంలోని ఓ ఇంటిపై అరుదైన డేగ కనిపించింది. దానిని గ్రామస్తులు పరిశీలించగా, కాలికి ప్లాస్టిక్ తాళ్లతో జీపీఎస్, వెనుక వైపు చిన్న కెమెరా ఉన్నట్లు గుర్తించారు. గంట సేపు ఆ ప్రాంతంలో చక్కర్లు కొట్టిన ఆ డేగ ఉన్నట్టు మాయమైంది.



## పళవేర్కాడ్ తీరంలో బర్మాపడవ

తిరువళ్లూర్ జిల్లా పళవేర్కాడు సమీపం కోరైకుప్పం తీరానికి బర్మా పడవ కొట్టుకు వచ్చింది. ఆ విషయాన్ని జాలర్లు మత్స్యశాఖ, తీర ప్రాంత రక్షణ దళం అధికారులకు తెలియజేశారు. వారు అక్కడకు చేరుకొని పరిశీలించి. ఆ రకం పడవలను బర్మా జాలర్లు వినియోగిస్తుంటారని చెప్పారు.

## బీచ్ షర్ట్‌తో టీఎం కృష్ణా కచేరి



మద్రాసు మ్యూజిక్ అకాడమీలో ప్రముఖ గాత్ర విద్వాంసుడు టీఎం కృష్ణా సంప్రదాయక దుస్తులు (పట్టు చొక్కా లేదా తెలుపు రంగు చొక్కా, పట్టు ధోవతి, లేదా సాధరణ ధోవతి) ధరించకుండా బీచ్ షర్ట్, లుంగీ ధరించి గాత్ర కచేరి నిర్వహించడం విశేషం.

### నవంబర్‌లో..



వృక్షా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్లతో సనా

అమెరికా బాలిక ప్రపంచ రికార్డు

తేని జిల్లా బోడినాయకనూర్‌లో రెండేళ్లుగా భరతనాట్యంలో శిక్షణ పొందిన అమెరికా బాలిక సనా (11) భరతనాట్య ముద్రల ప్రదర్శనలో ప్రపంచ రికార్డు నెలకొల్పింది. అమెరికాలో లాస్‌ఏంజెల్స్ ప్రాంతానికి చెందిన షణ్ముగమణి, నళిని దంపతుల కుమార్తె సనా అమెరికాలో జన్మించింది.

## కోవైలో వికసించిన బ్రహ్మకమలం

కోయంబత్తూర్ జిల్లా కుడియలూరు సమీపంలో ఏడాదికి ఒకసారి రాత్రి సమయాల్లో మాత్రమే వికసించే బ్రహ్మకమలంను చుట్టుపక్కల వారు ఆశ్చర్యంగా చూశారు. లక్ష్మీనగర్ ప్రాంతానికి చెందిన గజలక్ష్మి భాస్కరన్ తన ఇంట్లో బ్రహ్మకమలం మొక్కను పెంచుతున్నారు. ఆ మొక్కనుండి బ్రహ్మకమలం వికసించింది.

### చిత్రజ్యోతి

## యథార్థ ఘటన ఆధారంగా 'తుణిందవన్'



యథార్థ సంఘఘటన ఆధారంగా చేసుకుని 'తుణిందవన్' అనే పేరుతో ఓ చిత్రం రూపుదిద్దుకుంది. దేశంలో మహిళలపై నేరాలు జరుగుతున్నాయి. ఇలాంటి అంశాలను ప్రధానంగా చేసుకుని పదేళ్ళ బాలికపై జరిగిన ఓ దారుణ ఘటన ఆధారంగా 'తుణిందవన్' మూవీ రూపొందింది. తమిళం, మలయాళ భాషల్లో రూపొందిన ఈ చిత్రాన్ని సుజీష్ దేక్షణ కాశి, హరినారాయణన్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని దేక్షణ కాశి ప్రొడక్షన్ నిర్మించింది. ఇంద్రన్, జాఫర్, జానీ ఆంటోనీ, ఐఎన్. విజయన్, సుధీష్, దయానా హమీద్, అపర్ణ శివదాస్ నటించారు. కథలో ప్రధాన పాత్రను నిర్మాత కుమార్తె పదేళ్ళ కాశ్మీర పోషించారు. ఈ సినిమా షూటింగు మొత్తం కొట్టాయంలో పూర్తి చేశారు. ఈ సినిమా గురించి దర్శకుడు సుజీష్ మాట్లాడుతూ, 'ఓ గ్రామానికి చెందిన పదేళ్ళ బాలిక అంటే అందరికీ ఇష్టం. ఆ బాలిక వయసు చిన్నదైనా పరిపక్వత కలిగిన 20 యేళ్ళ యువతిలా నడుచుకుంటుంది. పైగా ఎదుటి వ్యక్తి ముఖకవళికల ద్వారా వారి మనసు అంచనా వేయగలదు. అన్యోన్యమైన జీవితాన్ని గడుపుతున్న ఆ కుటుంబంలో ఓ తుఫాను బీభత్సం సృష్టిస్తుంది. ఈ తుఫాను కారణంగా అనేక సమస్యలను ఎదుర్కొన్న ఆ చిన్నారి మళ్ళీ కుటుంబంతో కలిసిందా? లేదా? అన్నదే ఈ చిత్ర కథ. జనవరి నెల రెండో వారంలో విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నాం' అని పేర్కొన్నారు.

## సోషల్ - పొలిటిక్స్ థ్రిల్లర్‌గా 'ఎన్న విలై'

సజీవ్ పళూర్ దర్శకత్వంలో కరుణాస్, నిమిషా సజయన్ ప్రధాన పాత్రల్లో నటించిన కొత్త చిత్రం 'ఎన్న విలై'. సోషియల్, పొలిటికల్ థ్రిల్లర్ మూవీగా తెరకెక్కింది. చెన్నై, రామేశ్వరం, పుదుచ్చేరి, కొచ్చి సహా 56 ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకుంది. చిత్రీకరణ పూర్తయినట్టు చిత్ర బృందం ప్రకటించింది. కళామయ ఫిలిమ్స్ పతాకంపై జితేష్ నిర్మించారు. ఈ సినిమా వివరాలను ఆయన వెల్లడిస్తూ, 'ఎందరో ప్రతిభావంతులైన సినిమా బృందంతో కలిసి పనిచేయడం సంతోషంగా ఉంది. తాను ఎంచుకునే పాత్రలకు నటుడు కరుణాస్ న్యాయం చేస్తారు. నటి నిమిషా సజయన్ తన పాత్ర కోసం ఎంతగానో కష్టపడ్డారు. దర్శకుడు సజీవ్‌కు తమిళ చిత్రపరిశ్రమపై అమితమైన ప్రేమాభిమానాలున్నాయి. ఈ మూవీ ఖచ్చితంగా అభిమానులను ఆలరిస్తుంది. ఈ సినిమా తర్వాత కోలీవుడ్‌లో సరికొత్త అధ్యాయం మొదలవుతుంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసి త్వరలోనే విడుదల తేదీ వెల్లడిస్తాం' అని పేర్కొన్నారు. కాగా, ఈ సినిమాలోని ఇతర పాత్రల్లో వైజీ మహేంద్రన్, పూర్ణిమా భాగ్యరాజ్, మోహన్‌రామ్, లొల్లు సభ స్వామినాథన్, కవితాలయ కృష్ణ, దీపా శంకర్, మొట్టై రాజేంద్రన్, నక్కలైట్ కవి తదితరులు నటించారు.



షూటింగ్ పూర్తి చేసిన 'ఎన్న విలై' మూవీ యూనిట్

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో విరిగిపడిన పగడ చెట్టు కొమ్మలు

### తప్పిన ముప్పు


విరిగిపడిన పగడచెట్టు కొమ్మలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం 300 ఏళ్ల నాటి పగడ చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. ఆ సమయానికి భక్తులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని రాయలవారి మండపం పక్కనే పగడ చెట్టు ఉంది. ప్రస్తుతం రాయలవారి మండపంలో రూ.500 రాహుకేతు పూజలను జరిపిస్తుంటారు. అటు రాహుకేతు పూజలకు వచ్చే భక్తులతో పాటు పక్కనే ఉన్న ఉచిత ప్రసాదాలను స్వీకరించిన భక్తులు కూడా పగడచెట్టు కిందకు చేరుతుంటారు. ఈ క్రమంలో సోమవారం చెట్టు నుంచి రెండు భారీ కొమ్మలు ఒక్కసారిగా విరిగిపడ్డాయి. ఆ సమయంలో భక్తులు లేకపోవడంతో ముప్పు తప్పింది. ఇటీవల వర్షాలకు కొమ్మలునాని బరువు ఎక్కడం, చెట్టు వేరు వ్యవస్థకు నీరు చేరకపోవడం వల్ల కొమ్మలు బలహీన పడినట్లు అధికారులు భావిస్తున్నారు.

## ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్తులతో కిక్కిరిసింది. సోమవారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 28వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,738మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,615మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,856మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,265, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 414మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 383మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 153మంది భక్తులు పూజలుచేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 25,745 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.


ముక్కంటి ఆలయం వద్ద ఉన్న భక్తులు



# 'కొండ'ంత ప్రక్షాళనకు అడుగులు

### తిరుమలలో గాడిన పడుతున్న పాలన ● వైసీపీ పాలనలో అక్రమాలు.. కూటమి నేతృత్వంలో సంస్కరణలు

గతిస్తున్న ఈ ఏడాదిలో టీటీడీ మున్నెన్నడూ లేనివిధంగా జనం నోళ్లలో నానింది. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకాలు ఐదేళ్లు కొనసాగినా కూటమి ప్రభుత్వ ఏర్పడ్డాక బహిర్గతమై చర్చనీయాంశమయ్యాయి. దీంతో జాతీయ స్థాయిలో సైతం ముక్కున వేలేసుకునే పరిస్థితి ఏర్పడింది. దర్శనాలు మొదలుకుని లడ్డూ తయారీ వరకూ ఏమేరకు గాడితప్పాయో తేటతెల్లమైంది. జూన్ నుంచి సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఆలయంలో ప్రక్షాళన ప్రారంభమైంది. కొత్త బోర్డు సారథ్యంలో కొద్ది కాలంగా నెమ్మదిగా పాలన దారిన పడుతోంది. 2024 నిష్క్రమిస్తున్న వేళ వీటిలో ముఖ్యాంశాలను ఒకసారి అవలోకనం చేసుకుందాం...

- తిరుమల, ఆంధ్రజ్యోతి

### గత పాలకవర్గంలో మరకలు

● ఎన్నికల సమయంలో కావడంతో ఈ ఏడాది తొలి నుంచీ వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఇష్టానుసారం వీఐపీ బ్రేక్ టికెట్లు కేటాయించారు. జిల్లా మంత్రులకైతే రోజుకు 30 నుంచి 40 దర్శనాలు కూడా కేటాయించేవారు. లేఖపై ఆరుగురికే దర్శనం ఇవ్వాలనే నిబంధనను పదికి పెంచేశారు. బోర్డు చైర్మన్ నుంచి సభ్యుల వరకు అడ్డుఅదుపులేకుండా పోయింది.

● ముస్లింలకు శ్రీవారిసేవ అవకాశం కల్పిస్తామని, ఇతర మతస్తులపై హిందూమతంలోని పవిత్రజలాన్ని చల్లి ఆహ్వానిస్తామని ఫిబ్రవరిలో గత చైర్మన్ భూమన కరుణకర్‌రెడ్డి, ఈవో ధర్మారెడ్డి చేసిన ప్రకటనలు తీవ్ర దుమారం లేపాయి. భక్తుల్లో ఆందోళన కలిగించాయి.

● నిబంధనలకు విరుద్ధంగా శారదామఠం తిరుమలలో చేపట్టిన నిర్మాణాలు నాటి ప్రభుత్వ తీరుకు దర్పణం పట్టింది.

● టీటీడీ, అధికారులు, బోర్డు, సీఎం, అహోబిలం మఠం, జీయర్‌స్వాములు, అర్చకులపై ఆరోపణలు చేస్తున్నట్టుగా ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై గత బోర్డు రమణదీక్షితులను టీటీడీ నుంచి తొలగించింది. కేసు కూడా నమోదు చేసింది.

● పరకామణిలో దొంగతనం కేసు తీవ్రస్థాయిలో దుమారం రేపింది. దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయకుండా గత టీటీడీ, పోలీసులు రాజీ కుదుర్చుకోవడంపై మొదలైన విమర్శలు నేటికీ కొనసాగుతున్నాయి.

### కూటమి పాలనలో సంస్కరణలకు శ్రీకారం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే టీటీడీ ఈవోగా శ్యామలరావును నియమించింది. స్వామిక్షేత్రానికి పూర్వ వైభవం తీసుకొచ్చే బాధ్యతలను అప్పగించింది. జూన్ 16న బాధ్యతలు తీసుకున్న ఆయన తొలిప్రాధాన్యతగా లడ్డూలు, అన్నప్రసాదాల నాణ్యతపై దృష్టిపెట్టారు. లడ్డూకు వాడే నెయ్యిలో నాణ్యత లేదని గుర్తించారు. కొన్ని సరఫరా సంస్థలను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారు. నందిని వంటి సంస్థల ద్వారా నాణ్యమైన నెయ్యి దిగుమతికి చర్యలు తీసుకుని భక్తుల ప్రశంసలకు పాత్రులయ్యారు.

● ఇక, అవసరం లేకపోయినప్పటికీ నిర్మాణాల పేరుతో కోట్లాది రూపాయలు రోడ్లు, భవనాలు, ఆస్పత్రుల పేరుతో మళ్లించడం కూడా టీటీడీ వార్తల్లో నిలిచింది. రాజకీయ లబ్ధికోసమే టీటీడీ నిధులతో తిరుపతిలో రోడ్లు వేశారనే విమర్శలు వైసీపీని వెంటాడాయి.

### మారిన అన్నప్రసాదాల రుచి

అన్నప్రసాదాల నాణ్యతపై దృష్టిపెట్టారు. బియ్యం, కూరగాయలు, ముడిసరులకు ల విషయంలో శ్రద్ధ తీసుకున్నారు. దీంతో అన్నప్రసాదాల నాణ్యత మెరుగుపడింది. వైసీపీ ప్రభుత్వానికి ముందున్న పద్ధతుల్లోనే రుచికరంగా నైవేద్య అన్నప్రసాదాలను నివేదిస్తున్నారు.దిట్టం పెంచారు. భక్తులకూ స్వామి ప్రసాదాలు అందేలా చర్యలు తీసుకున్నారు.

### శీఘ్ర దర్శనానికి అడుగులు

● తిరుమలక్షేత్రాన్ని గత వైసీపీ నాయకులు రాజకీయ ప్రసంగాలకు వేదికగా మార్చుకున్న తీరుపై నవంబరు 6న బీఆర్ నాయుడు ఆధ్వర్యంలోని బోర్డు తొలి సమావేశంలోనే బ్రేక్ పెట్టారు. రాజకీయాలు మాట్లాడితే కేసులు పెట్టేలా తీర్మానించారు.

● నిబంధనలు అతిక్రమించిన శారదమఠం లీజునూ రద్దు చేశారు.

● ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)టెక్నాలజీ ద్వారా గంట నుంచి రెండు గంటల్లోనే దర్శనమయ్యేలా కృషి మొదలుపెట్టారు.



● అన్యమత ఉద్యోగులను తిరుమల నుంచి పంపేలా ప్రణాళికలు రూపొందించారు.

● స్వామి సొమ్ముకు భద్రతను కల్పించేలా ప్రభుత్వ బ్యాంకుల్లోనే డిపాజిట్లు చేయాలని నిర్ణయించారు.

● గత ప్రభుత్వంలో రూ.కోట్లు కొల్లకొట్టేందుకు దారి చూపిన టూరిజం దర్శన టికెట్ల కోటాను రద్దు చేశారు.

● గత ప్రభుత్వం నిలిపివేసిన స్థానికుల దర్శన విధానాన్ని పునరుద్ధరించి తిరుపతి వాసుల మనసు గెల్చుకున్నారు. ● అర్హులకే బ్రేక్ దర్శనాలు కల్పిస్తున్నారు. నాలుగైదు కిలోమీటర్లు ఉండే సర్వదర్శన క్యూలైన్లు ప్రస్తుతం కనిపించడం లేదు.

● స్వర్ణాంధ్ర విజన్-2047 తరహాలో 'తిరుమలవిజన్-2047'కి శ్రీకారం చుట్టి తిరుమల అభివృద్ధికి కసరత్తు చేస్తున్నారు.

● గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై స్టేట్ విజిలెన్స్ ఫోకస్ పెట్టింది.

## 'ఏపీకే ఫైల్' ఓపెన్ చేయొద్దు: ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): 'సైబర్ నేరగాళ్లు ఏపీకే ఫైల్‌తో న్యూ ఇయర్ విషెస్ పదాన్ని వాడుకుని ట్రేడింగ్ చేసి డబ్బులు కాజేయడానికి సిద్ధమవుతున్నారు. అలా వచ్చిన ఏపీకే ఫైల్‌ను ఓపెన్ చేయకండి. ఒకవేళ ఓపెన్ చేస్తే మీ ఫోన్ కంట్రోల్ అంతా సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లిపోతుంది. మీ మొబైల్ యాప్స్, మొబైల్‌లో జరిగే ప్రతి కదలికలను గుర్తిస్తారు. బ్యాంకు ఖాతాల వివరాలు, ఫొటోలు, వీడియోలు, కాంటాక్టు నెంబర్లు, ఇతర ఫైల్స్ తీసుకుంటారు. మీకు తెలియకుండానే డబ్బులు కాజేస్తారు' అని ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు. నూతన సంవత్సర సందేశాల విషయంలో జాగ్రత్తగా ఉండాలంటూ సోమవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొబైల్‌లో ఉన్న ఏపీకే వంటి స్కామ్ ఫైల్స్‌ను తక్షణమే తొలగించాలని సూచించారు. ఎక్కడైనా సైబర్ నేరం జరిగిందని తెలిసిన వెంటనే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ క్రైం బారిన పడినవారు తిరుపతి పోలీసు మైదానంలోని సైబర్ క్రైం ఆఫీసుకు వెళ్లి ఫిర్యాదు చేయాలన్నారు.

## గంజాయి స్వాధీనం

### ● ఇద్దరు ఒడిశా యువకుల అరెస్టు

శ్రీకాళహస్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో ఏడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరు ఒడిశా యువకులను అరెస్టు చేసినట్లు రెండో పట్టణ పోలీసులు సోమవారం తెలిపారు. ప్రభుత్వాస్పత్రి రోడ్డులో ఇద్దరు యువకులు గంజాయితో సంచరిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామన్నారు. గంజాయి సహా ఇద్దరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఒడిశాకు చెందిన బిజయ్(29), సుక్కు(25)గా గుర్తించి కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు.

## ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు

### ● రూ.ఆరు లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు జైలు శిక్ష, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ ఎర్రచందనం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి సోమవారం తీర్పునిచ్చారు. దీనికి సంబంధించి భాకరాపేట సీఐ ఇమ్రాన్‌బాషా తెలిపిన ప్రకారం.. పీలేరు మండలం రేగల్లుకు చెందిన లింగం అశోక్, పీలేరుకు చెందిన క్రాంతికుమార్ 2016లో ఆటోలో నాలుగు ఎర్రచందనం దుంగలను అక్రమంగా తీసుకెళుతున్నారు. ఈ విషయం తెలిసి భాకరాపేట పోలీసులు ఆటోను తనిఖీ చేశారు. నాలుగు దుంగలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండుకు పంపారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి.. ఒక్కొక్కరికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు.

## ప్రతి అర్జీకీ పరిష్కారం చూపండి

### ● అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశం
### ● కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 284 అర్జీలు


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలకు సంబంధించి వచ్చే ప్రతి అర్జీకీ పరిష్కారం చూపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 284 అర్జీలు అందగా అందులో భూసమస్యలపై 148, పంచాయతీరాజ్‌కు 90 ఉన్నాయి. సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు అర్జీలు స్వీకరించారు.

### ముంతాజ్ హోటల్ నిర్మాణం ఆపాలంటూ ధర్నా



శ్రీవారి పాదాల చెంత చేపట్టిన ముంతాజ్ హోటల్ నిర్మాణాలను నిలుపుదల చేయాలని పలు హిందూ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మద్యం, మాంసం, స్పా, స్విమ్మింగ్ పూల్ వంటి వాటితో వెలుస్తున్న ముంతాజ్‌హోటల్ నిర్మాణం పూర్తయితే హిందువుల మనోభావాలు దెబ్బతింటాయని తిరుక్షేత్రాల రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మా ఓంకార్ పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట హిందు సంఘాల నాయకులు కిరణ్, సుధాకర్‌చౌదరి, రమాదేవి, నీలకంఠ, మధు, బాబు, రాజేంద్రప్రసాద్, వెంకటేష్ ధర్నా చేపట్టారు. బీజేపీ నేతలు కూడా ఆందోళన చేపట్టారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు వినతిపత్రం అందజేశారు.

### కాలనీకి రోడ్డు వేయండి

తిరుపతి నగర పరిధిలోని ఒకటో డివిజన్ అన్నమయ్య మార్గం పక్కనే ఉన్న మస్తాన్‌నాయుడు కాలనీ(కొత్తపల్లి)కి రోడ్డు వేయాలని కాలనీ వాసులు కలెక్టర్‌ను కోరారు. గుంతలమయంగా ఉన్న మట్టి రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నామని, డ్రైనేజీ వ్యవస్థ లేక ఇళ్ల మధ్యే మురుగునీరు ప్రవహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణంతో పాటు డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కోరారు. కాగా, తమ ఇళ్లను అన్యాయంగా కూల్చివేశారని, న్యాయం చేయాలని రేణిగుంట మండలం చెంగారెడ్డిపల్లె వాసులు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు.

### దివ్యాంగుడికి మూడు చక్రాల సైకిల్



శ్రీకాళహస్తి మండలం ఎంపేడుకు చెందిన దివ్యాంగుడు ఈశ్వరయ్యకు జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారి వినోద్ కలిసి సోమవారం ట్రైసైకిల్ అందజేశారు. తాను టేబుల్ ఫ్లవర్స్ వ్యాపారం చేస్తున్నానని, రెండు కాళ్లు లేవని, ట్రైసైకిల్ అందజేస్తే వ్యాపారానికి ఉపయోగపడుతుందని గత పీజీఆర్ఎస్‌లో చేసిన అభ్యర్థనపై స్పందించిన కలెక్టర్ స్పందించి, అందజేశారు.

### కులగణనలో న్యాయం చేయండి



షెడ్యూల్ కుల గణనలో ఎస్సీ మాదిగకు బదులుగా ఎస్సీ ఆది ఆంధ్ర, ఎస్సీ ద్రావిడ నమోదు కావడాన్ని సరిదిద్ది ఎస్సీ మాదిగలుగా పరిగణించాలని ఎమ్మార్పీఎస్ నేతలు నరేంద్రబాబు, గోపి మాదిగ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తిరుపతి జిల్లాలో నగరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, చంద్రగిరి నియోజకవర్గాల్లో దాదాపు 70శాతం మాదిగలను ఎస్సీ ఆది ఆంధ్ర ఉపకులంగా చూపుతున్నారని, తక్షణం సరిదిద్ది ఎస్సీ మాదిగలుగా నమోదు చేయాలని కోరారు.

# సైబర్ నేరాలు పెరిగాయి

### సాధారణ దొంగతనాలు తగ్గాయి
### ● వివాహేతర సంబంధాలు, కుటుంబ తగాదాతోనే పలు హత్యలు
### ● ఎస్పీ సుబ్బరాయుడు వెల్లడి


అధికారులతో కలిసి మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం),డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):'జిల్లాలో ఈ ఏడాది సైబర్ నేరాలు పెరిగాయి.కానీ, పోలీసు శాఖ తీసుకున్న ముందస్తు చర్యలతో సాధారణ నేరాలు తగ్గాయి' అని ఎస్పీ సుబ్బరాయుడు వెల్లడించారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ సావేరి అతిథి గృహంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో వార్షిక నేర గణాంకాలను ఎస్పీ వెల్లడించారు. 2023లో సైబర్ నేరగాళ్లు రూ.2.45 కోట్లు దోచుకోగా.. రూ.84.08 లక్షలు రికవరీ చేశామన్నారు. ఈ ఏడాది రూ.12.89 కోట్లకుగాను రూ.2.36 కోట్లను రికవరీ చేసి బాధితులకు ఇచ్చామన్నారు. మొబైల్ హంట్ ద్వారా ఇప్పటి వరకు రూ.7.56 కోట్ల విలువచేసే దాదాపు 4275 సెల్‌ఫోన్లు రికవరీ చేశామన్నారు. జిల్లాపోలీసులు టెక్నాలజీని వినియోగించి ఐదు సంచలనాత్మక కేసులను ఛేదించినట్లు తెలిపారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగే దాదాపు 100 బ్లాక్ స్పాట్‌లను గుర్తించామన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన 882 ఫిర్యాదుల్లో 762 పరిష్కరించినట్లు తెలిపారు. పారదర్శకత, పౌర స్నేహక పోలీసింగ్‌ను మెరుగుపరచడానికి 'పోలీసు వెబ్‌సైట్' ప్రారంభించామన్నారు. దొంగతనాలు, నేరాలు, రోడ్డు ప్రమాదాలు, వైట్ కాలర్ నేరాలు, ఇతర నేరాల గురించి గణాంకాల సహా వివరించారు. ఇక, ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ద్వారా ఆరు నెలల్లో దాదాపు 100 కేసులు నమోదు చేసి 2061 దుంగలు.. 108 వాహనాలు సీజ్ చేసినట్లు చెప్పారు. ముగ్గురిపై పీడీ యాక్టు పెట్టామన్నారు. కోర్టు మానటరింగ్ వ్యవస్థ ద్వారా అన్ని శాఖలను సమన్వయం చేసుకోవడంతో పోక్సో, హత్యలకు సంబంధించి 13 కేసుల్లో కొందరికి జీవిత ఖైదు, మరికొందరికి ఐదారేళ్ల జైలు శిక్షలు పడ్డాయన్నారు. వివాహేతర సంబంధం, కుటుంబ తగాదాలు, బంధువుల మధ్య గలాటాల కారణంగా చాలావరకు హత్యలు జరిగాయని అభిప్రాయపడ్డారు.

**గంజాయిపై ఉక్కుపాదం**

ప్రత్యేక టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేసి ఆరు నెలల్లో గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. 85 కేసులు నమోదు చేసి 872.307 కిలోలు, 17 వాహనాలను స్వాధీనం చేసుకుని 223 మందిని అరెస్టు చేశామన్నారు. 239 మందిపై గంజాయి షీట్స్ ఓపెన్ చేశామన్నారు. విద్యా సంస్థల్లో 241 డ్రగ్స్ నిరోధక కమిటీలు ఏర్పాటు చేశామన్నారు.

**వీవీఐపీల భద్రతకు పెద్దపీట**

'ఏడాది కాలంలో దాదాపు 1069 మంది వీవీఐపీలు జిల్లాకు వచ్చారు. శాంతి భద్రతలకు విఘాతం లేకుండా వీరికి భద్రత కల్పించాం. తిరుమల బ్రహ్మోత్సవాలు, శ్రీకాళహస్తి మహాశివరాత్రి ఉత్సవాల్లోనూ భక్తుల మనోభావాలకు భంగం వాటిల్లకుండా బందోబస్తు ఏర్పాటు చేశాం. తిరుచానూరు ఉత్సవాలు బ్రహ్మాండంగా జరిగాయని సీఎం చంద్రబాబు అభినందించారు' అని ఎస్పీ పేర్కొన్నారు.

## రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం అభినందనీయం


పనిముట్లను పంపిణీ చేస్తున్న కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

రేణిగుంట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాల ఉత్పత్తులు, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించడం అభినందనీయమని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడిలోని రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వరిలో డ్రమ్ సీడర్, భూసార పరీక్షా ఆధారిత ఎరువుల యాజమాన్యం, డ్రోన్‌ల వినియోగం, సమగ్ర వ్యవసాయ విధానాలను రైతులకు చేరువ చేయడంలో కేవీకే కృషి అద్భుతమన్నారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఐసీఏఆర్ అటారీ డైరెక్టర్ ఎన్ షేక్‌మీరా, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ప్రసంగించారు. రైతులకు ప్రదర్శన క్షేత్రాల నిమిత్తం విత్తనాలు, పనిముట్లను పంపిణీ చేశారు. రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకటరత్నం, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి ఆలయంలో అధ్యయనోత్సవాల ప్రారంభం



తిరుమల, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో అధ్యయనోత్సవాలు సోమవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులోభాగంగా రాత్రి 7.30 నుంచి 8.30 గంటలవరకు రంగనాయక మండపంలో కార్యక్రమాలు నిర్వహించారు. ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశికి 11 రోజుల ముందు నుంచి 25 రోజుల పాటు వీటిని నిర్వహించడం ఆనవాయితీ. కార్యక్రమంలో జీయర్‌స్వాములు, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### జాతీయ పడవ పోటీలకు ఆంధ్రా క్రీడాకారులు


ఢిల్లీకి బయలుదేరిన క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో జనవరి 3-6మధ్యలో జరిగే నేషనల్ డ్రాగన్‌బోట్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 31 మంది క్రీడాకారులు పయనమయ్యారు. శ్రీకాకుళం, విజయనగరం, ఏలూరు, విజయవాడ, నెల్లూరు, కర్నూలు, తిరుపతి జిల్లాల నుంచి డ్రాగన్ బోట్ క్రీడాకారులు వారం రోజులుగా రాయలచెరువులో శిక్షణ తీసుకున్న విషయం తెలిసిందే. సోమవారం రాత్రి శ్రీనివాస క్రీడా సముదాయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో శాప్ చైర్మన్ రవినాయుడు క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. జాతీయస్థాయి పోటీలలో రాణించి అధిక పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్, ప్రదీప్‌నాయుడు, డీఎస్ఏ కోచ్‌లు పాల్గొన్నారు.

## సోలార్ టాప్‌తో విద్యుత్ ఆదా చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ చంద్రశేఖరరావు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూర్యాఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ ఈఈ విన్నకోటి చంద్రశేఖరరావు విజ్ఞప్తి చేశారు. పాత తిరుచానూరు రోడ్డులోని విద్యుత్ ఈఈ కార్యాలయంలో సోమవారం సాయంత్రం కాంట్రాక్టర్లతో ఆయన సమావేశమయ్యారు. గృహాలపై సోలార్ టాప్‌లను అమర్చుకుని విద్యుత్ పొదుపు చేసుకోవాలని కోరారు. రాయితీ పథకాలను వినియోగించుకుంటేమరిన్ని ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. డిప్యూటీ ఈఈ ఆంజనేయులు, జయప్రకాష్, మునిప్రసాద్, రమేష్‌లు, ఏఈలు, సోలార్ రూఫ్‌టాప్ కంపెనీల కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## దక్షిణ భారత సాంస్కృతిక విజేతగా ఎస్వీయూ

### 11 అంశాల్లో వర్సిటీకి బహుమతుల పంట


మెడల్స్‌తో ఎస్వీయూ విద్యార్థులు, అధికారులు - ట్రోఫీ అందుకుంటున్న ఎస్వీయూ విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత సాంస్కృతిక విజేతగా ఎస్వీ యూనివర్సిటీ నిలిచింది. చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వేదికగా నిర్వహించిన దక్షిణ భారత సాంస్కృతికోత్సవంలో ఎస్వీ యూనివర్సిటీకి చెందిన కళా బృందాలు, విద్యార్థులు పోటీల్లో పాల్గొని ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. క్లే మోడలింగ్‌లో మొదటి స్థానం, పోస్టర్ మేకింగ్‌లో మొదటి స్థానం, ఇన్‌స్టాలేషన్‌లో ద్వితీయ స్థానం, రంగోళిలో ద్వితీయ స్థానం, మెహందీలో ద్వితీయ స్థానం, క్లాసికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో నాల్గవ స్థానం, ర్యాలీలో నాల్గవ స్థానం, డ్యాన్స్‌లో ఐదవ స్థానం, లైట్ ఓకల్‌లో ఐదవ స్థానం, కొల్లేజ్‌లో ఐదవ స్థానం, క్లాసికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో ఐదవ స్థానంలో నిలిచి ఎస్వీయూ విద్యార్థులు బహుమతుల పంట పండించారు. వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు వారిని అభినందించారు. ప్రభుత్వ సహకారంతో వచ్చే ఏడాది యూనివర్సిటీ వేదికగా దక్షిణ భారత సాంస్కృతికోత్సవం నిర్వహిస్తామని అన్నారు.

## సీఎంను కలిసిన టీటీడీ చైర్మన్

తిరుమల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడిని టీటీడీ ధర్మకర్తల మండలి చైర్మన్ బీఆర్ నాయుడు సోమవారం అమరావతిలో కలిశారు. తిరుమలలో భక్తులు గంటల తరబడి క్యూలైన్లు, కంపార్టుమెంట్లలో వేచిఉండే అవసరం లేకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ద్వారా త్వరితగతిన దర్శనం కల్పించే ప్రయత్నాలు చేస్తున్నట్టు సీఎంకు ఆయన వివరించినట్లు తెలిసింది. ఏఐ ఏర్పాటుకు ముగ్గురు నిపుణులతో కూడిన కమిటీని వేయాలని సీఎంను కోరగా, సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. అలాగే స్విమ్స్ ఆస్పత్రి నిర్వహణకు టీటీడీ నుంచి ప్రతి ఏడాది రూ.వంద కోట్లు నష్టం వాటిల్లుతోందని, ఆరోగ్యశ్రీ నుంచి రూ.80 కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. అలాగే చిన్నపిల్లల ఆస్పత్రి, స్విమ్స్‌లో నూతన భవనాల నిర్మాణాలు, వాటి ఖర్చుపై సీఎంకు వివరించగా వెంటనే వాటిని నిలిపివేసేలా బోర్డులో నిర్ణయం తీసుకున్నట్టు సీఎంకు చైర్మన్ వివరించినట్లు తెలిసింది. ఉద్యోగులకు నేమ్ బ్యాడ్జీ, టీటీడీలో అన్యమత ఉద్యోగుల బదిలీ, వీఆర్ఎస్ తదితర అంశాలను ప్రస్తావించినట్లు సమాచారం.